గోల్కొండ బోనాలకు ఏర్పాట్లు

అధికారులతో పర్యవేక్షించిన ఉత్సవ కమిటీ చైర్మన్ అరవింద్ మహేష్ కుమార్

మెహిదీపట్నం జూలై 4: తెలంగాణ ఆషాఢ మాసం బోనాలు జూలై 7వ తేదీన ప్రారంభం కానున్నాయి. కేవలం రెండు రోజులే మిగిలి ఉండగా, ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్ల విషయంలో చాలా వెనుకబడి ఉన్నారు. చారిత్రాత్మక గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో ప్రారంభమయ్యే తెలంగాణ ఆషాఢ మాసం బోనాలు నెల రోజుల పాటు కొనసాగుతాయి. జంట నగరాల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కూడా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించడానికి వస్తారు. గోల్కొండ కోటలో భక్తుల కోసం నీటి ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేయాల్సి ఉండగా, గురువారం మధ్యాహ్నం నుంచి నీటి ట్యాంకర్లను పెట్టడం ప్రారంభించారు. క్యూలైన్ల కోసం బారికేడ్ల నిర్మాణంతో పాటు స్టేజీల ఏర్పాటు పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇదిలా ఉండగా, గురువారం జీహెచ్ఎంసీ సర్కిల్-13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, ఈఈ వెంకట శేషయ్య, డిప్యూటీ ఈఈలు రామకృష్ణ, జమీల్‌లతో కలిసి గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేష్ కుమార్ పర్యవేక్షించారు. శనివారం సాయంత్రం వరకు మొత్తం పనులను ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి చేయాలని చైర్మన్ అరవింద్ మహేష్ కుమార్ సూచించారు. లంగర్‌హౌస్ చౌరస్తా సమీపంలో స్టేజి వేసే పనులు శనివారం సాయంత్రం నుంచి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. లంగర్‌హౌస్‌లో జీహెచ్ఎంసీ ఈఈ వెంకటశేషయ్య పర్యటించి రోడ్ల గుంతల మరమ్మతుల పనులను వెంటనే పూర్తి చేస్తామన్నారు.

గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాట్ల గురించి జీహెచ్ఎంసీ సర్కిల్ -13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖతో మాట్లాడుతున్న గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ అరవింద్ మహేష్ కుమార్

బోనాలకు అందుబాటులో బస్సులు

సిటీబ్యూరో, జూలై 4(నమస్తే తెలంగాణ): గోల్కొండ జగదాంబిక బోనాలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు గ్రేటర్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు గురువారం పేర్కొన్నారు. సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే, సీబీఎస్, పటాన్‌చెరు, ఈసీఐఎల్, మెహిదీపట్నం, దిల్‌షుక్‌నగర్, కూకట్‌పల్లి, చార్మినార్, ఉప్పల్, మల్కాజిగిరి, ఓల్డ్ బోయిన్‌పల్లి నుంచి 75 బస్సులు నడుపుతున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు.. ఎంజీబీఎస్ - 90004 06069, మెహిదీపట్నం - 99592 26133, గోల్కొండ - 99592 26031 ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చని చెప్పారు.

ఎల్లంపల్లిలో అత్యవసర మోటార్ల ఎత్తివేత!

15 పంపులు తీసి యథావిధిగా నీటి తరలింపు

ఇన్‌ఫ్లోతో నగర నీటి సరఫరాకు ఉపశమనం

సిటీబ్యూరో, జూలై 4(నమస్తే తెలంగాణ): గోదావరి జలాల తరలింపులో భరోసా దక్కింది. గోదావరి పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కొన్ని రోజులుగా ఎల్లంపల్లిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం 1100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరడంతో నగర నీటి సరఫరాకు ఉపశమనం కలిగింది. ఈ నేపథ్యంలోనే ఎల్లంపల్లిలో ఏర్పాటు చేసిన అత్యవసర మోటార్లను జలమండలి అధికారులు ఎత్తివేశారు. గత నెల రెండో వారంలో ఎల్లంపల్లిలో నీటి నిల్వలు తగ్గడంతో అత్యవసర పంపింగ్ ద్వారా 15 పంపులు ఏర్పాటు చేసి 11 పంపులతో ఎత్తిపోసి నీటిని అప్రోచ్ ఛానల్‌లోకి రోజూ 163 ఎంజీడీల నీటిని తరలించారు. ప్రస్తుతం, ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 13997 మీటర్ల(4.85 టీఎంసీలకు) పెరగడంతో 11 పంపులను తొలగించి అత్యవసర పంపులను తొలగించారు. నగరానికి గోదావరి జలాల తరలింపు యథావిధిగా కొనసాగుతుందని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని సీజీఎం దశరథ్ రెడ్డి తెలిపారు.

ఏఆర్కే యాప్‌లో ఎస్జీటీ ఉచిత ఆన్‌లైన్ పరీక్షలు

జూబ్లీహిల్స్, జూలై 4: వికారాబాద్ పట్టణంలో ఏఆర్కే స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎస్జీటీలకు జూలై 12, 14 తేదీలలో సాయంత్రం 6 గంటల నుంచి 8:30 గంటల వరకు ఉచిత ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సర్కిల్ డైరెక్టర్ బీవీ రమణ తెలిపారు. ఈ పరీక్షలు రాయడానికి ప్లే స్టోర్ నుంచి ఏఆర్కే స్టడీ సర్కిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహించే ప్యాటర్న్‌లో 160 ప్రశ్నలు.. 80 మార్కులకు ఈ పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఎస్జీటీ రాసే ప్రతి విద్యార్థి ఈ పరీక్షలను ఉపయోగించుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నం. 94410 22571లో సంప్రదించాలని కోరారు.

కలెక్టరేట్‌లో దొడ్డి కొమరయ్యకు నివాళి

తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి వేడుకలను హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన గొప్ప వ్యక్తి దొడ్డి కొమురయ్య అని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరివన్, డీఆర్ఓ వెకంటాచారి, బీసీ అభివృద్ధి శాఖాధికారి ఆశన్న, యాదయ్య, కలీం, డాక్టర్ సురేందర్ పాల్గొన్నారు. - సిటీబ్యూరో, జూలై 4(నమస్తే తెలంగాణ);

తమిళనాడు తరహాలో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ వ్యవస్థను అమలు చేయాలంటూ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఏ.దేవ సేనను కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ బాలిగ, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం - హిమాయత్‌నగర్

'పార్లమెంట్‌లో ఎంఎస్‌పీ చట్టం చేయాలి'

రామన్నపేట, జూలై 4 : రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడం కోసం పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని తాసీల్దార్ లాల్‌బహదూర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు, పెట్టుబడులకు పొంతన లేకుండా ఉన్నదన్నారు. నాయకులు వెంకటేశం, విజయభాస్కర్, ఆనంద్, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురై.. 8వ అంతస్తు నుంచి దూకి...

మన్సూరాబాద్, జూలై 4: మానసిక ఒత్తిడికి గురై ఓ మహిళా డాక్టర్ ఎనిమిదవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్, బండ్లగూడలోని సహభావన టౌన్‌షిప్, ఏ బ్లాక్, టవర్ 5, ఫ్లాట్ నెం.801లో మధుసూదన్‌రావు, నిరూపమ దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఎంబీబీఎస్ పూర్తి చేసిన కూతురు డాక్టర్ నిహారిక రావు (29) ఉంది. నిహారిక రావు కంటి వైద్యురాలు. రెండు సంవత్సరాల క్రితం మనోహర్ష అనే వైద్యుడితో వివాహం జరిగింది. మనోహర్ష ఢిల్లీలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నాడు. వివాహం అనంతరం నిహారిక రావు ఏఎస్ రావు నగర్‌లో నివాసముండేది. అక్కడ మంచినీటి కొరత ఉండటంతో గత పదకొండు నెలలుగా తల్లిదండ్రులు నివాసముండే బండ్లగూడలోని సహభావన టౌన్‌షిప్‌లో ఉంటుంది. పీజీ పరీక్షలకు సిద్ధం అవుతుంది. కాగా కరోనా సమయంలో వైద్యురాలిగా సేవలు అందిస్తూ తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై డిప్రెషన్‌లోకి పోయింది. రెండు, మూడు సార్లు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. ఆమెను పలుమార్లు వైద్యులకు చూపించి చికిత్సను అందిస్తున్నారు. కాగా గురువారం ఉదయం 10:30 గంటల సమయంలో తల్లిదండ్రులు ఇంట్లో ఉన్నారు. మెయిన్ డోర్ నుంచి బయటకు వచ్చిన నిహారిక 8వ అంతస్తులోని కారిడర్ నుంచి కిందకు దూకి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గత కొంత కాలంగా డిప్రెషన్‌లో ఉంటూ మానసిక ఒత్తిడి గురై తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి మధుసూదన్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

మహిళ తో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

అడ్డగూడూరు : మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన ఓ మహిళ గురువారం తన ఇంట్లో స్నానం చేయడానికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన దుర్నోజు రవీంద్రాచారి అసభ్యంగా సైగలు చేశాడు. ఆమె భర్తకు తెలుపడంతో రవీంద్రాచారితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య ఘర్షణ నెలకొనడంతో పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లగొండ వాసికి ఆంగ్లంలో డాక్టరేట్

అజయ్ కుమార్

జూబ్లీహిల్స్, జూలై 4: నల్గొండ పట్టణంలోని ఓం సాయి కాలనీకి చెందిన శివర్ల అజయ్ కుమార్‌కు ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ వైఎల్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆంగ్లంలో 'మార్కెటింగ్ మైథాలజీ: ఏ స్టడీ ఆఫ్ ది మైథాలజికల్ వర్క్స్ ఆఫ్ అమిష్ త్రిపాఠి, ఆనంద్ నీలకంఠన్ అండ్ దేవదత్ పట్నాయక్' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఈ అవార్డు దక్కింది. అజయ్ ప్రస్తుతం, హైదరాబాద్ బడంగ్‌పేట్‌లోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా పని చేస్తున్నారు. గతంలో వివిధ ప్రధాన పత్రికల్లో సుమారు పదేండ్ల పాటు జర్నలిస్ట్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. అజయ్‌కి డాక్టరేట్ రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.భవాని, హెచ్ఓడీ డాక్టర్ ఎన్.ఎస్.రాహుల్, తోటి అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, మిత్రులతో పాటు స్వగ్రామమైన నిడుమనూరు మండలం నారమ్మగూడెం గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ గురుకులాల ఆర్‌సీఓ రజనీని సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ఎస్సీ గురుకుల విద్యాలయంలో విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మోత్కూరు, జూలై 4 : ఎస్సీ గురుకులాల ఆర్‌సీఓ రజనీని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్సీ బాలుర గురుకుల విద్యాలయాన్ని గురువారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల వసతులు, మెనూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌సీఓ రజనీ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై గురుకుల విద్యాలయాల పర్యవేక్షణను విస్మరించారన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. పర్యవేక్షణ చేయకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నందున జిల్లాలోని పలు గురుకులాల్లో విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదని తెలిపారు. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, వరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలడుగు పెద్ద చెరువు కత్వకు మరమ్మతులు చేపట్టాలి

పాలడుగు పెద్ద చెరువు కత్వ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మోత్కూరు, జూలై 4 : మండలంలోని పాలడుగు పెద్ద చెరువు కత్వకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. చెరువు కత్వ వద్ద గురువారం పార్టీ కార్యకర్తలతో కలిసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోనే పాలడుగు చెరువు పెద్దదని, దత్తప్పగూడెం, దాచారం, పొడిచేడు, ముషిపట్ల రాగిబావి, పనకబండ గ్రామాల్లో భూగర్భజలాల పెరుగుదలకు దోహద పడుతుందని అన్నారు. కత్వ నుంచి నీరు వృథాగా పోతుండడంతో చెరువు నిండడం లేదని, నిధులు మంజూరు కత్వ మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దడిపెల్లి ప్రభాకర్, పిట్టల చంద్రయ్య, సోమరాజు, లక్ష్మణ్, గంగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

విద్యార్థుకు నోటు పుస్తకాలు అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, జూలై 4 : మండలంలోని తాజ్‌పూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో గురువారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఎండీ సలీమ్, అధ్యక్షుడు పక్కీరు కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బొమ్మరపు సురేశ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఓరుగంటి రమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా నాయకుడు కల్లూరి మల్లేశం అన్నారు. గురువారం డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించి మాట్లాడారు. ఇండ్ల మధ్య మురుగు నీరు, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారిందన్నారు. అధికారులు స్పందించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, నాయకులు మల్లేశం, స్వామి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

గుంతల రోడ్లను బాగు చేయాలి : సీపీఎం

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. ఖాజీపేట గ్రామం వద్ద బీటీ రోడ్లపై ఏర్పడిన గుంతలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీశైలం, నాయకులు రవీందర్‌రెడ్డి, మైసయ్య, గణేశ్, నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న కేదారి

రాజాపేట, జూలై 4 : మండల కేంద్రానికి చెందిన వరిమడ్ల సత్తయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్వాతి చికెన్ సెంటర్ యజమాని నెమిలె కేదారి సత్తయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రమేశ్‌గౌడ్, మధు, సిద్దులు, కనకరాజు, నాని, రాజు, కనకయ్య, అంజయ్య, యాదయ్య, బాలరాజు, శ్రీను, కుమార్ పాల్గొన్నారు.

పోచంపల్లిలో భారీ వర్షం

రహదారిపై నిలిచిన వర్షపు నీరు

భూదాన్ పోచంపల్లి, జూలై 4 : పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు, వీధులు జలమయమయ్యాయి. కెనరా బ్యాంక్ సమీపంలో మెయిన్ రోడ్డుపై వర్షపు నీరు నిల్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

రైతులకు పంట పరిష్కారాలను అందించేలా.. గ్రోవెరో

గ్రోవెరో టెక్నాలజీస్ సంస్థ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శ్రీకాంత్

మాదాపూర్, జూలై 4: రైతులకు వినూత్న పద్ధతిలో పంట పరిష్కారాలను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గ్రోవెరో టెక్నాలజీస్ సంస్థ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ శ్రీకాంత్ పీజే అన్నారు. కొండాపూర్‌లోని హోటల్ స్కైలాలో గ్రోవెరో టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భాగంగా ఆపరేషన్ కమర్షియల్ ఎక్సలెన్స్ డైరెక్టర్లు సురేష్ వేముల, విష్ణు వర్ధన్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్ దేవేంద్ర దాసరి, గ్రోవెరో టెక్నాలజీస్ సీఈఓ నవదీప్ మోహతా, స్ట్రాటజిక్ మార్కెటింగ్ మేనేజర్ తరుణ్ పాంటాలతో కలిసి రైతులకు ఉత్తమ పరిష్కారాలను అందించే దిశగా అడుగులు వేస్తూ గ్రో ఐ ఎక్స్ అప్లికేషన్‌తో పాటు భూ సాంద్రతను పెంచేందుకు ఉపయోగపడే సేంద్రీయ ఉత్పత్తులకు చెందిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, రైతుల సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించే దిశగా గ్రోవెరో టెక్నాలజీస్ పనిచేస్తుందన్నారు. ఇతర దేశానికి చెందిన టెక్నాలజీతో కలిసి పనిచేస్తు భారతదేశంలో రైతులకు ఈ విధానాన్ని చేరువ చేయాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చినట్లు తెలిపారు. వాతావరణానికి అనుకూలంగా ఉండే సేంద్రీయ ఉత్పత్తులతో పాటు 15 రోజుల ముందే వర్షం వచ్చే దాన్ని పసిగట్టి ఎటువంటి తెగుళ్లు వస్తాయో.. రైతులకు ముందుగానే తెలియజేస్తుందని, దీంతో రైతులు ముందుగానే ఆయా మందులను వాడి పంట నష్టపోకుండా ఉండేందుకు దోహపడుతుందన్నారు. గ్రోవెరో టెక్నాలజీ అన్ని భవిష్యత్‌లో వ్యవసాయ రంగంలో కీలక పాత్ర పోశించనున్నట్లు చెప్పారు. ఇకో బూస్టర్ కేవలం ఉత్పత్తి మాత్రమే కాదని, రైతులకు నీటిని పొదుపు చేసుకునే వెసులుబాటును కల్పిస్తుందన్నారు. రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు గ్రోవెరో టెక్నాలజీ ఉత్తమ పరిష్కార మార్గమన్నారు. కార్యక్రమంలో హెడ్ వెస్ట్ బిజినెస్ హబ్ పంకజ్ గుప్తా, సేల్స్ హెడ్ సెంట్రల్ స్ట్రాటజిక్ బిజినెస్ హబ్ అనీల్ వర్మ, సేల్స్ హెడ్ నార్త్ స్ట్రాటజిక్ హబ్ ధనరాజ్ ఉన్నారు.

ఇక డిప్యూటీ కలెక్టర్ల చేతిలోకి తాసీల్దార్లు

సేవల్లో వేగం పెంచేందుకు కలెక్టర్ ప్రత్యేక ప్రణాళిక

ప్రతి వారం ఎమ్మార్వో కార్యాలయాల్లో సేవలపై ఆరా

ప్రభుత్వ భూముల రక్షణకు ల్యాండ్ బ్యాంక్ యాప్

సిటీబ్యూరో, జూలై 4(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. ప్రజలకు వేగవంతంగా సేవలందించడంలో భాగంగా ఆయన ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. అవినీతి, అలసత్వం, సమయపాలన పాటించకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం చేసే వారిని ఏ మాత్రం సహించేది లేదంటూ కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో 16 మంది తహసీల్దార్లకు కలెక్టర్ క్లాస్ తీసుకున్నారు. ప్రతి తహసీల్దార్ కార్యాలయంపై డిప్యూటీ కలెక్టర్లతో నిఘా ఉండనుంది. అందుకు జిల్లాలో నలుగురు డిప్యూటీ కలెక్టర్లను నోడల్ అధికారులుగా ఎంపిక చేశారు. ఒక్కొక్కరు నాలుగు ఎమ్మార్వో కార్యాలయాలను ప్రతివారం సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై కలెక్టర్‌కు ప్రత్యేక రిపోర్ట్ ఇస్తారు. అంతేకాదు కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులు ఎన్ని? పెండింగ్‌లో ఎందుకున్నాయి? పరిష్కరించినవి ఎన్ని? తదితరవన్నీ ఏ రోజుకు ఆ రోజే లెక్కలు తేల్చి రిపోర్ట్ రెడీ చేస్తారు. ప్రధానంగా కుల, ఆదాయ, నివాస, ఈబీసీ, ఓబీసీ తదితర రెవెన్యూ ధ్రువ పత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు కలెక్టర్ డిప్యూటీ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 4 నుంచి జూలై 4 వరకు రెవెన్యూ శాఖకు 33,494 దరఖాస్తులు రాగా, అందులో 24,776 దరఖాస్తులకు పరిష్కారమయ్యాయని తెలిపారు. ప్రభుత్వ భూముల రక్షణకు ల్యాండ్ బ్యాంక్ యాప్ రూపొందించాలని సూచించారు. నిరూపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములు, భవనాల లెక్క తేల్చి వాటి పరిస్థితిని తెలుపాలని కోరారు. రెవెన్యూ అధికారులంతా సమన్వయంతో పనిచేసి హైదరాబాద్‌ను ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలపాలని సూచించారు.

కాంట్రాక్ట్‌లకు జీవో నం.60 ప్రకారం జీతాలు చెల్లించాలి

తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ డీఎంఈతో ఏఐటీయూసీ నాయకుల సమావేశం

వైద్య విద్య సంచాలకులు డాక్టర్ వాణికి వినతి పత్రం అందజేస్తున్న ఎండీ యూసుఫ్, ఎం.నరసింహులు

సుల్తాన్ బజార్, జూలై 4: ప్రభుత్వ దవాఖానాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీతాల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని, జీవో నం.60 ప్రకారమే జీతాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్,ప్రధాన కార్యదర్శి ఎం నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కోఠిలోని డీఎంఈ కార్యాలయంలో డీఎంఈ సంచాలకులు డాక్టర్ వాణితో వారు రెగ్యులర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డితో గురువారం కలిసి వినతి పత్రం అందజేసి సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2022లో టెండర్ పిలిచే సమయంలో టీఎస్ఎంఐడీసీ, డీఎంఈ కార్మికుల జీతాల చెల్లింపుల విషయంలో సరైన అవగాహన లేకుండా టెండర్ షెడ్యూల్‌లో జీవో నం.60 ప్రకారం జీతాలు చెల్లించాలని పొందుపరిచారని పేర్కొన్నారు. అనంతరం, ఆ జీవోను ప్రక్కన పెట్టి మరో సర్క్యులర్ విడుదల చేసి ఆ సర్క్యులర్ ప్రకారం జీతాలు చెల్లించాలని తెలియయజేయడంతో గందరగోళం ఏర్పడి, కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని వారు డీఎంఈ దృష్టికి తీసుకువెళ్శారు. కార్మికులకు జీవో ప్రకారం ప్రస్తుతం ఉన్న రూ.7,500ల నుంచి రూ.10 వేలకు పెంచినప్పుడే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. చట్టం ప్రకారం, రావాల్సిన పండుగ సెలవులు, జాతీయ సెలవులు, ఆర్థిక సెలవులను అమలు చేయాలన్నారు. ఈ విషయమై డీఎంఈ సానుకూలంగా స్పందిస్తూ కార్మికుల సమస్యలను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకువెళ్శి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.

హెచ్‌సీయూలో బర్త్‌కేర్ ప్రాక్టీషనర్‌పై కోర్సు షురూ..

బర్త్ కేర్ ప్రాక్టీషనర్ కోర్సు ప్రారంభిస్తున్న ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎవిటా ఫెర్నాండెజ్

కొండాపూర్, జూలై 4: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో బర్త్ కేర్ ప్రాక్టీషనర్ (బర్త్ డౌలా) సర్టిఫికెట్ కోర్సును హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గురువారం ప్రారంభమైంది. ప్రసవ సమయంతో పాటు ప్రసవానికి ముందు, తర్వాత తల్లులకు అవసరమైన మద్దుతును అందించడానికి అవసరమైన నైపుణ్యాలు, విజ్ఞానంతో ఔత్సాహ